క్లుప్తంగా

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మండలంలోని మూలపల్లె బస్టాప్ వద్ద ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం 5వ వార్షికోత్సవాన్ని పంచాలమర్రి, ఎర్రసానిపల్లె గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. పూజారి పోస్టు చంద్రారెడ్డి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. వెంగలంవారిపల్లె కురవపల్లెకు చెందిన గంగయ్య కుమారుడు పాలేటిప్రసాద్ అనుమతులు లేకుండా నిమ్మనపల్లె పంచాయతీ బోడె బండ వద్ద నుంచి అక్రమంగా ఇసుక తీసుకుని వస్తుండగా, విచారించి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : మిద్దెపై నుంచి పడి భవనని ర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణంలోని రంగారెడ్డి కాలనీ కొత్త ఇండ్లకు చెందిన గౌస్ మోదిన్ కుమారుడు ఎస్.అల్లాబక్షు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం పట్టణంలోని శేష్ మహల్ సమీపంలో పనులకు వెళ్లాడు. పనుల్లో భాగంగా మిద్దెపై నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో అల్లాబక్షు తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల తనిఖీ

గుర్రంకొండ: మండలకేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఖాజాబీ తనిఖీ చేశారు. స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ ఖాజాబీ జెడ్పీహైస్కూల్‌కు చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. అందులో ఉన్న సౌకర్యాలు, ఇంకా ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై అధికారులకు సూచనలిచ్చారు, ఆమె వెంట ఎంఈఓ సురేంద్రబాబు, ఎస్ఐ దిలీప్‌కుమార్, వీఆర్వో అన్వర్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు మండలం పర్తికోటకు చెందిన సి.నాగమణి మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆమె నుంచి 15 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పెద్దపాళ్యం దర్గాలో ప్రార్థనలు


వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లాను సన్మానిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ములకలచెరువు: మండలంలోని పెద్దపాళ్యంలో వెలసిన పురాతన హజరత్ సులేమాన్ దర్గాను అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

వారపు సంతలో పూల దుకాణాలు

పీలేరు : స్థానిక వారపుసంతలో పూల దుకాణాలు ఏర్పాటుకు స్థలం సిద్ధం చేస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం వారపు సంతలో స్థలం చదును చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూల వ్యాపారస్తులకు అనువుగా అందరూ ఒక చోట వ్యాపారం చేసుకునే విధంగా వారపుసంత ఆవరణలో స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. త్వరలో గదులు ఏర్పాటు చేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. పూల వ్యాపారస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాలనీ చిన్న, మునీర్, అబీద్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

28లోగా పంట వివరాలు నమోదు చేసుకోండి

ములకలచెరువు: మండల రైతులందరూ ఈ నెల 28వ తేదీ లోపు పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ లీలాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో వేసిన పంటల రుణాలకు సున్నీ వడ్డీ వర్తించాలన్నా... పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ అందాలన్నా పంట నమోదు తప్పనిసరి అన్నారు. ఆర్బీకే కేంద్రాలకు వెళ్లి రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు.

నారసింహా.. నమో..నమో..!

- ఈనెల 27 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 11 రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న టీటీడీ అధికారులు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం


శ్రీ తరిగొండ వెంగమాంబ


శ్రీలక్ష్మీనరసింహస్వామి

గుర్రంకొండ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై విరాజిల్లుతున్నాడు మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారసింహుడు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల27 తేది నుంచి వచ్చేనెల 09 వరకు 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం గత వారం రోజులుగా టీటీడీ అధికారులు అని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే ఆలయంలోనే శ్రీవెంకటేశ్వర స్వామి భక్తురాలు తరిగొండ వెంగమాంబ ఆలయం కుడా ఉండడం గమనార్హం.

ఆలయ పూర్వ చరిత్ర

పూర్వకాలంలో దుర్వాస మహామునిచే ఆలయంలో స్వామివారు ప్రతిష్ఠించబడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. చోళరాజుల కాలంలో బాకరాపేట సమీపంలోని చిట్టిచెర్ల గ్రామంలో రామానాయుడు అనే పాలేరు కుటుంబానికి పశుసంపద ఎక్కువగా ఉండేది. వారు పశువులను మేపుకొంటూ తరికుండకు వచ్చేవారు. ప్రస్తుత ఆలయం ఉన్న ప్రాంతమంతా అటవీప్రాంతంగా ఉండేది. పశువులు ఇక్కడి వచ్చి సేద తీరేవి. ఒక రోజు రామానాయుడు దంపతులు మజ్జిగ చిలుకుతుండగా మజ్జిగ కుండలో స్వామి వారు నల్లటి రాయిలాగా ఉద్భవించాడు. రాయి అనుకొని మజ్జిగ కుండలో నుంచి తీసి పక్కన పడేశారు. మురుసటి రోజు మళ్ళీ ఇదే సంఘటన పునరావృతమైంది. అదే రోజు రాత్రి స్వామివారు రామనాయుడు కలలో కనిపించి తాను లక్ష్మీనరసింహస్వామినని చెప్పి తరికుండకు పశ్చిమ భాగంలో మార్లెగెవి(గుహ) ఉన్నట్లుగాను, అందులో కావల్సినంత ధనం ఉందని ఆధనంతో ఇక్కడ ఆలయం నిర్మించాలని చెపాడు. మరుసటి రోజు సదరు గెవి వద్దకు వెళ్లి పరిశీలించగా నిజంగా ధనం కనిపించింది. ఆ ధనంతో ఆలయాన్ని పునఃప్రతిష్ట చేశాడు. అప్పటి నుంచి తరికుండ తరిగొండగా మారింది. స్వామవారిఆలయం ముందుభాగంలో దుర్వాస మహాముని చేత ప్రతిష్ఠంచబడిన ధర్మపీఠం ఉంది. ఇక్కడ అసత్య ప్రమాణాలు చేస్తే వారి వంశం నిర్వంశం అవుతుందని మహాముని శాపముంది.

11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

ఈనెల 27 తేదిన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, కలశస్థాపన, పుణ్యావాచనం, స్వస్తివాచనం నిర్వహించారు. 28న ధ్వజారోహణము, ఊంజల్‌సేవ, హంసవాహనం , మార్చి 01న ముత్యపుపందిరి వాహనం, ఊంజల్‌సేవ, హనుమంత వాహనం, 02న కల్పవృక్ష వాహనం, ఊంజల్‌సేవ, సింహవాహనం, 03న తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవ, పెద్ద శేష వాహనం, 04న తిరుచ్చి ఉత్సవం, గజవాహనం,05న తిరుచ్చి ఉత్సవం, సర్వభూపాల వాహనం, కల్యాణోత్సవం, గరుడసేవ నిర్వహించనున్నారు. 06న రథారోహణం, రథగమనం, ధూళీ ఉత్సవం, 07న సూర్యప్రభావాహనం, ఊంజల్‌సేవ, చంద్రప్రభవాహనం, అశ్వవాహనం, పార్వేట ఉత్సవం, 08న వసంతోత్సవం, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం, 09న స్నపన తిరుమంజనం, పుష్పయాగం నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు

స్వామివారి బ్రహోత్సవాలకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొండమనాడు నుంచి స్వామివారి వాహనాలన్నింటిని ఇప్పటికే ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం ముందుభాగంలో మండపాలు చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో కొత్తగా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బ్రహోత్సవాల పర్యవేక్షణ కోసం వచ్చే అధికారులకు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించే కళాకారుల కోసం అతిథి గృహాలు సిద్ధం చేశారు. గ్రామంలోని స్వామివారి ఆలయం నుంచి బస్టాండు వరకు రోడ్డుకిరువైపులా విద్యుద్దీపాలంకరణ, స్వామివారి చిత్రాలను విద్యుద్దీపాలతో తయారు చేసి ఉంచారు. స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

పీలేరు : వేసవి దృష్ట్యా వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఫ్యామిలీ ఫిజిసియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఒంటిల్లులో వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్ఎస్ ద్రావణం ఆవశ్యకతపై అవగాహన కల్గి ఉండాలన్నారు. అధిక పగటి ఉష్ణోగ్రతలు ఉధృతి దృష్ట్యా నీటితోపాటు పళ్ల రసాలు, కొబ్బరి నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ తాగాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని, వేసవిలో తిరగరాదన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు నాగముత్యం, వెంకటరత్నం, నాగసుధ పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

చైల్డ్ హెల్త్ రాష్ట్ర నోడల్ అధికారి విజయకుమార్


హెల్త్ అర్బన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న చైల్డ్ హెల్త్ రాష్ట్ర నోడల్ అధికారి విజయ్‌కుమార్

మదనపల్లె : గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించేలా వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని చైల్డ్‌హెల్త్ రాష్ట్ర నోడల్ అధికారి విజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ...జిల్లాలోని పడమటి మండలాల్లో గర్భిణుల్లో రక్తహీనత కారణంగా మాతా శిశుమరణాలు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా రక్తహీనత ఉన్న గర్భిణులు నమోదవుతున్నారన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి రక్తహీనత కేసులను గుర్తించాలన్నారు. గర్భిణులకు ఐరన్‌మాత్రలు పంపిణీతో పాటు ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు వేయాలన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం పొందేవరకు వారి ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉంచాలని వైద్యసిబ్బందికి సూచించారు. అదేవిధంగా గర్భిణులను ఆస్పత్రికి తీసుకువచ్చి అన్ని రకాల వైద్యపరీక్షలతో పాటు ఈసీజీ స్కానింగ్ చేయించాలన్నారు. ఆరోగ్యసమస్యలను ప్రాథమికదశలో గుర్తించి నివారణకు చర్యలు తీసుకుంటే మాతా శిశుమరణాలు తగ్గుముఖం పడుతాయని వివరించారు. రక్తహీనత ఉన్న బాధితులను హైరిస్క్ కేసులుగా నమోదు చేయాలన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ల రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ లక్ష్మీ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు


హాస్టల్ సిబ్బందితో విచారణ జరుపుతున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి

పీలేరు : విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని జిల్లా గిరిజన సంక్షేమాధికారి కె. అబ్బోలామ్ అన్నారు. స్థానిక మదనపల్లె మార్గంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులచే బయట నుంచి వంటపత్రాలతో నీరు తీసుకొచ్చినట్లు ఫొటోలు, వీడియో క్లిప్పింగ్‌తో జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమాధికారి పీలేరు పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, వార్డెన్ గోపి, వంట మనిషి మల్లికార్జున, వాచ్‌మెన్ లక్ష్మీపతిలకు మెమో జారీచేసినట్లు వివరించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

కేవీపల్లె : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. శుక్రవారం మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ కస్తూర్బా గురుకుల విద్యాలయం బాలికలకు వరం లాంటిదని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు మంచి మెనూతో కూడిన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ రెడ్డికాంతమ్మ గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ. 10 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

కలకడ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై కలకడ ఇందిరమ్మ కాలనీ సమీపంలో జరిగిన ప్రమాదంలో గడిబండ గ్రామానికి చెందిన చిన్నకోట్ల జయరాం మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదానికి కారణమైన బాలయ్యగారిపల్లె పంచాయతీ తోటిపల్లె కు చెందిన పాటూరి సురేంద్రపై మృతుని కుమారుడు పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఇల్లు

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఇల్లు మంజూరు చేయాలని జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ శివయ్య ఏఈలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ డీఈ కార్యాలయంలో తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, పెద్దమండ్యం హౌసింగ్ ఏఈలు , డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా పూర్తి అయిన ఇళ్ల నిర్మాణలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరైనా అర్హులు తమకు ఇల్లు మంజూరు కాలేదని విమర్శలు, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ శ్రీహరి, ఏఈలు సుజాత, వెంకటరెడ్డి, లావణ్య, శ్రీనివాసులు, సోహేల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవల తిరునాల

వాల్మీకిపురం: పట్టణ శివారు ప్రాంతంలోని శతశృంగ పర్వతశ్రేణుల్లో కొలువైన శ్రీ అక్కదేవతల ఆలయంలో శుక్రవారం అక్కదేవతల తిరునాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం పూజారి వెంకటరాజు ఆధ్వర్యంలో గుర్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అలాగే చాందినీ బండ్లను ఏర్పాటు చేసి గొందిగుంట గుడి వరకు మేళతాళాల నడుమ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గుడి వద్ద అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫణికుమార్, రవి, ఆనంద శెట్టి, వివిధ ప్రాంతాల భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కలకడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నేటిశ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రాజ, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలోని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

వాల్మీకులకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట

మదనపల్లె : వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మంగమ్మ, మధుసూదన్‌లకు ఎమ్మెల్సీ సభ్యులుగా అవకాశం కల్పించి ఆ వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని ఆ సంఘ నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వాల్మీకిసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు పులిశ్రీనివాసులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సద్దలజయసింహ, గాదిభాస్కర, కొత్త ఉడుం శంకర, వలసలమంజు, మునగమానురెడ్డిశేఖర, పిడుగురఘునాథ్, అరవలక్ష్మీనారాయణ, బొంతసోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్‌యాప్ ద్వారా పెట్రోల్ బంకుల తనిఖీ

మదనపల్లె : రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో మొబైల్‌యాప్ ద్వారా రియల్‌టైమ్ తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్ఓ కె.రఘురామ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జనరల్ ఏజెన్సీ, బాలాజీ ఏజెన్సీ, మాస్కో ఏజెన్సీలకు సంబంధించిన పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్‌బంకుల్లో వినియోగదారులకు అందిస్తున్న ఉత్పత్తుల నాణ్యత, సేవలు, ధరలు, మౌలికవసతులను పరిశీలించారు. మొబైల్ యాప్ ద్వారా పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించేందుకు మదనపల్లె నియోజకవర్గంలోని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లయిస్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ విజిలెన్స్ నారాయణరెడ్డి, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, డీటీ రెడ్డెప్ప పాల్గొన్నారు.

పారదర్శకంగా వైఎస్సార్ సంపూర్ణపోషణ

– కర్నూలు జోన్ ఆర్‌జేడీ పద్మజ


మాట్లాడుతున్న కర్నూలు జోన్ ఆర్‌జేడీ పద్మజ

పీలేరు రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణను పారదర్శకంగా అందించాలని కర్నూలు జోన్ ఆర్‌జేడీ పద్మజ, ఐజీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో పీలేరు, కేవీపల్లె అంగన్‌వాడీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 2275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, అందులో 9 ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. 1.35 లక్షల మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలందరికీ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఇప్పటి వరకు 35 వేల మందికి మాత్రమే ఎన్‌రోల్‌మెంట్ జరిగిందని, మిగిలింది మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టిక నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, డీఎల్‌పీవో నారాయణ, సూపర్‌వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కయమ్మ, ఉమ, శాంత, సర్తాజ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఆనంద్ రెడ్డి తదితరులు

వాల్మీకిపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కేవీపల్లి మండలంకు చెందిన మాజీ సర్పంచ్ ఆనంద్ రెడ్డికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ రెడ్డి శుక్రవారం తన అనుచరులతో కలసి స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువతో సన్మానించారు. ఎంతో నమ్మకంతో రైతు సంఘం జిల్లా అధ్యక్షత పదవిని ఇచ్చినందుకు ఎంపి, ఎమ్మెల్యే, హరీష్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంభంవారిపల్లి మండల నాయకులు గజ్జల శీనురెడ్డి, ఎల్లయ్య, ద్వారకనాథ రెడ్డి, హరినాథ్, తులసి, ఆదినారాయణ, పద్మ, రెడ్డెప్ప, సుమతి, మూర్తి, హరిబాబు, చిన్నయల్లప్ప, రోజ పాల్గొన్నారు.

ఎస్టీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్జి


సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి ప్రవీణ్‌కుమార్

మదనపల్లె : ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు పట్టణంలోని కదిరిరోడ్డులోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాత్‌రూమ్స్ అపరిశుభ్రత, హాస్టల్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, దోమలు, మెనూ ప్రకారం భోజన వసతులు అందడం లేదని చెప్పుకొచ్చారు. హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతున్నందున విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం లేదని, చాలా ఇరుకుగా ఉన్న గదుల్లో దుర్భర పరిస్థితుల్లో తాము గడుపుతున్నట్లు పిల్లలు జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. బాత్‌రూమ్స్ నిర్వహణ సక్రమంగా లేకపోగా, బట్టలు ఉతుక్కునేందుకు సౌకర్యంగా లేదని, హాస్టల్ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయని ఫిర్యాదుచేశారు. హాస్టల్‌లో గుర్తించిన లోటుపాట్లపై జడ్జి ప్రవీణ్‌కుమార్ రిపోర్ట్ తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి

పీలేరు : గ్రామ సచివాలయ సిబ్బంది మరింత బాధ్యతగా పని చేయాలని డీపీఓ ధనలక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, 1వ గ్రామ సచివాలయాన్ని, చెత్తసేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా అందించాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడానికి తమవంతు కృషి చేయాలన్నారు. జిల్లాలో 501 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నులు రూ.13.46 కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. మార్చి ఆఖరులోపు పన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నారాయణ, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.